## దివ్యాంగుల యూడీఐడీ కార్డుల జారీలో మార్గదర్శకాలు విధిగా పాటించాలి

- సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్

కలెక్టరేట్, మార్చి 1: సదరం సర్టిఫికెట్లకు బదులుగా దివ్యాంగుల శాశ్వత గుర్తింపు కోసం జారీ చేస్తున్న యూనిక్ డిసెబిలిటీ ఐడెంటిటీ కార్డుల మంజూరులో అధికారులు మార్గదర్శకాలు విధిగా పాటించాలని, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి దివ్యాదేవరాజన్ స్పష్టం చేశారు. యూడీఐడీ కార్డుల జారీ, సోలార్ పవర్ ప్లాంట్లపై కలెక్టర్ పమేలా సత్పతితో ఆమె శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైద్యులు ధ్రువీకరించిన వైకల్యశాతంతో కూడిన సదరం సర్టిఫికెట్‌ను యూడీఐడీ పోర్టల్‌లో నమోదు చేయాలని, వారి ఇతర వివరాలు కూడా సంపూర్ణంగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఐడీకార్డు స్పీడ్ పోస్టు ద్వారా నేరుగా వారి ఇంటికే చేరుతుందన్నారు. యూడీఐడీ కార్డుల కోసం మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని, సదరం ధ్రువీకరణపత్రం ఉన్నవారికి డీఆర్‌డీఏ ద్వారా యూడీఐడీ జనరేట్ చేయనున్నట్లు వెల్లడించారు. గతనెలాఖరు వరకు జారీచేసిన సదరం సర్టిఫికెట్లతో చేయూత పెన్షన్, ఇతర సదుపాయాలు మన రాష్ట్రంలోని దివ్యాంగులు పొందవచ్చని, ఇతర రాష్ట్రాల్లో ఏవేని సౌకర్యాలు పొందాలంటే యూడీఐడీ కార్డు తప్పనిసరి అని తెలిపారు. మార్చి 1 నుంచి వీటిని జారీ చేస్తున్నట్లు చెప్పారు. ఇకముందు వీటి ద్వారానే పెన్షన్, ఇతర సౌకర్యాలు పొందాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో ఉన్న మీసేవ కేంద్రాల నిర్వాహకులు, పంచాయతీ కార్యదర్శులు, వీవోఏలు, సీసీలు, ఎంపీడీవోలు, ఏడీఎంలకు యూడీఐడీ దరఖాస్తుల నమోదుపై అవగాహన శిక్షణ అందించాలన్నారు. యూడీఐడీ కార్డుకు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి హాస్పిటల్‌లో స్లాట్ బుకింగ్ చేసి సమాచారం అందించాలని, నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన అనంతరం కార్డు జనరేట్ చేయాలన్నారు. పీఎం కుసుం పథకం కింద సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు జిల్లా స్థలాలు గుర్తించినట్లు, ఆయాచోట్ల విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన డీపీఆర్‌లు తయారు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీవో శ్రీధర్, ఐసీడీఎస్ సీడీపీవో శ్రీమతి, తదితరులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ జరిపితే మూడేళ్ల జైలు

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి వెంకట రమణ

విద్యానగర్, మార్చి 1 : గర్భస్థ శిశువుగా ఉన్నపుడు స్త్రీ, పురుష లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చట్ట ప్రకారం మూడేళ్ల శిక్షకు అర్హులవుతారని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ హెచ్చరించారు. శనివారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, చేయించుకున్న వారికి కూడా ఈ శిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా విధించే ఆస్కారం ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాల్లో స్పెషల్ డ్రైవ్ ద్వారా తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక బృందంలో గైనకాలజిస్టు, ప్రోగ్రాం అధికారి, మహిళా తహసీల్దార్, మహిళా పోలీసు అధికారి, సఖీ కన్సల్టెంట్, డాటా ఎంట్రీ ఆపరేటర్ ఉంటారని చెప్పారు. స్కానింగ్ కేంద్రాల్లో కచ్చితంగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ధరల పట్టిక, రికార్డుల నిర్వహణ ఉండాలని, ప్రతి నెలా జరిగే స్కానింగ్ వివరాలను తనకు పంపించాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు. జిల్లాలోని దవాఖానల్లో జరిగే అబార్షన్ కేసులు, లింగ నిర్ధారణ కారణంగా ఏవైనా అబార్షన్లు జరిగాయేమో పరిశీలించాలన్నారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌తో సమన్వయం చేసుకుంటూ అబార్షన్ మాత్రల అమ్మకాలపై నిత్యం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో వైద్యాధికారులు రవీందర్ రెడ్డి, ఉమాశ్రీ, సజిదాఅతహరి, నిర్మల, కళ్యాణి, దివ్య, సుజాత, సన జవేరియా, రాజగోపాల్, ప్రకృతి ఎన్జీవో రమాదేవి, టూటౌన్ ఏఎస్ఐ విజయమణి, హెల్త్ ఎడ్యుకేటర్ కైక తదితరులు పాల్గొన్నారు.

### ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక వైద్య శిబిరం

విద్యానగర్, మార్చి 1: నగరంలోని సుభాష్‌నగర్‌లో ఆదర్శ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్, ఇంపాక్ట్ గ్రూప్ ఆఫ్ ఫౌండేషన్ సంయుక్తంగా శనివారం ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. డెర్మాటాలజి, జనరల్ ఫిజిషియన్, జనరల్ సర్జన్‌లు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న వారికి న్యూట్రిషన్ కిట్స్ అందించారు. ఈ శిబిరంలో 100 మందికి పైగా పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

చిగురుమామిడి, మార్చి 1: బొమ్మనపల్లి గ్రామంలోని విస్డం ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకున్నది. విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు పాఠశాల కరస్పాండెంట్ కంది సంధ్య తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నీలి శ్రీనివాస్, ఉపాధ్యాయులు సౌమ్య, రమేశ్, శ్రీనివాస్, కుమారస్వామి, రాజకుమార్, సురేశ్, ప్రవీణ, శ్వేత, సౌజన్య తదితరులున్నారు.

## ప్రజాక్షేత్రంలో ఉంటూ సమస్యలపై పోరాడండి

- ప్రజలంతా మన వైపే ఉన్నారు
- కార్యకర్తలకు నాయకులకు అండగా ఉంటా
- కమలాపూర్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



వీణవంకలో మాజీ జడ్పీటీసీ రాజమల్లయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్ టౌన్, మార్చి 1: నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజల సమస్యలపై పోరాటం చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని కేసీ క్యాంపులో గల ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమలాపూర్ మండల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనపై విసుగు చెందిన తెలంగాణ ప్రజలంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయడం లేదని, వాటి అమలు కోసం ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడూ నిలదీయాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై నిలదీస్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై కేసులు పెడుతున్నారని, ప్రజా ప్రతినిధులను అక్రమంగా అరెస్టు చేసినప్పుడు నియోజకవర్గం మొత్తం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా తాను కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు. ఇకపై రాబోయే ప్రతి ఎన్నికల్లో నాయకులంతా కష్టపడి పనిచేస్తే విజయం తప్పక మనదే అవుతుందన్నారు. ప్రతీ గ్రామంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను కూడా ప్రజలకు తెలిసేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే, ఈ నెల 10వ తేదీ లోగా అన్ని గ్రామాల్లో కమిటీలు వేయాలన్నారు. వేర్వేరుగా జరిగిన ఈ సమావేశాల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తిరుపతి రావు, సత్యనారాయణ రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనా రెడ్డి, మాజీ జడ్పీటీసీలు లక్ష్మణ్ రావు, నవీన్, కృష్ణప్రసాద్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు కమలాపూర్ మండలానికి చెందిన నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

**మాజీ జడ్పీటీసీ కుటుంబానికి పరామర్శ**

వీణవంక, మార్చి 1: మండల కేంద్రానికి చెందిన మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ నాయకుడు ఆనందం రాజమల్లయ్య ఇటీవల మృతిచెందగా, శనివారం సాయంత్రం ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పరామర్శించారు. రాజమల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఇక్కడ మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, కమలాపూర్ మాజీ జడ్పీటీసీ పుల్ల నవీన్‌కుమార్, సింగిల్‌విండో డైరెక్టర్, మాజీ ఉపసర్పంచ్ వోరెం భానుచందర్, నాయకులు సత్యనారాయణరావు, ఇంద్రసేనారెడ్డి, వోరెం మధు, తాళ్లపెల్లి మహేశ్, తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపూర్: మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులతో విద్యార్థులు



గంగాధర: లక్ష్మీదేవిపల్లి నరేంద్ర పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

## విద్యాలయాల్లో వీడ్కోలు హంగామా

శంకరపట్నం, మార్చి 1: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శనివారం టెన్త్, ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులు వీడ్కోలు సమావేశాలు, విద్యాలయ వార్షికోత్సవాలు ఉత్సాహంగా సాగాయి. తొమ్మిదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు టెన్త్, ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు 'ఆనందోత్సవ్' పేరుతో వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఎంతగానో అలరించాయి. ప్రిన్సిపాల్ సరిత విద్యార్థులకు భావి జీవితంపై సందేశం ఇచ్చారు. పాఠశాలను వదిలి వెళ్లనున్న విద్యార్థులు పాఠశాలతో తమకు గల అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరిత, ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్, మార్చి 1: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో శనివారం పది విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులు సూచించారు. పది పరీక్షలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వనజ, పీఈటీ అంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంగాధర, మార్చి 1: మండలంలోని లక్ష్మీదేవిపల్లిలోని నరేంద్ర పాఠశాలలో శనివారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అంతకుముందు ప్రిన్సిపాల్ గంగాధర రాజేశం, కరస్పాండెంట్ గుజ్జుల గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు ఇష్టపడి చదివి కన్నవారికి, ఉన్న ఊరికి, పాఠశాలకు పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మండల వాసికి స్టార్ ఈఎంటీ అవార్డు

వీణవంక, మార్చి 1: మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన దాసారపు సంపత్ స్టార్ ఈఎంటీ అవార్డుకు ఎంపికయ్యారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో 108లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌గా సంపత్ విధులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ ప్రోగ్రాం మేనేజర్ సలీం శనివారం కరీంనగర్‌లోని ఆఫీస్‌లో సంపత్‌కు ప్రశంసాపత్రం అందజేశారు.

### నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య

విద్యానగర్ మార్చి 2 : కరీంనగర్‌లోని ప్రభుత్వ నర్సింగ్ పాఠశాలలో తృతీయ సంవత్సరం పూర్తి చేసుకున్న నర్సింగ్ విద్యార్థిని చుంచు అలేఖ్య (22) ఆత్మహత్య చేసుకుంది. తన స్వగ్రామమైన ఎల్కతుర్తి మండలకేంద్రంలో మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగగా, వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం మధ్యాహ్నం మృతి చెందింది. అయితే, ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కాగా, నర్సింగ్ పాఠశాలలో అందరితో కలిసి మెలిసి ఉంటూ చదువులో ముందంజలో ఉండేదని పాఠశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ రమాబాయి తెలిపారు. తోటి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నదని తెలుసుకున్న పాఠశాల విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ ప్రభావతితోపాటు సిబ్బంది వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానలో అలేఖ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు. దవాఖాన సూపరింటెండెంట్ గుండా వీరారెడ్డి సంతాపం తెలిపారు.



అలేఖ్య (ఫైల్)


నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★ Nalla Lavanya W/o. Nalla Mahendar (Old Name) H.No. 2-23, V/o.Ramraopally Sanugula Chandurthi Mandal Rajanna Sircilla Dist. Have Changed My name as NALLA GOUTHAMI W/o. NALLA MAHENDAR (New Name)

NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571

9182 777 189


### నేడు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

హుజూరాబాద్ టౌన్, మార్చి 1: హుజూరాబాద్‌లో జరుగబోయే రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం ఆదివారం హుజూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు హుజూరాబాద్ హాకీ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రస్థాయి హాకీ క్రీడలు ఈనెల 16 నుంచి 18 వరకు హుజూరాబాద్‌లోని హైస్కూల్ గ్రౌండ్‌లో రాష్ట్రస్థాయి సీనియర్ హాకీ టోర్నమెంట్ జరుగనున్నట్లు చెప్పారు. అర్హత కలిగిన క్రీడాకారులు తమ హాకీ ఇండియా ఐడీ కార్డులతో మధ్యాహ్నం 3 గంటలకు హైస్కూల్ గ్రౌండ్‌లో సెలక్షన్స్‌కు హాజరు కావాలని కోరారు. సమావేశంలో హాకీ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

### వింధ్యావ్యాలీలో సౌర కుటుంబంపై అవగాహన





అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వింధ్యావ్యాలీ చిన్నారులు

కొత్తపల్లి, మార్చి 1 : స్థానిక మెహర్‌నగర్‌లోని వింధ్యావ్యాలీ పాఠశాలలో శనివారం చిన్నారులకు సౌర కుటుంబంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీ ప్రకాశ్‌రావు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల స్థాయిలో ప్రీ ప్రైమరీ చిన్నారులకు సౌర కుటుంబంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. సూర్యుడు దాని చుట్టూ తిరిగే అంతరిక్ష వస్తువులను అన్నింటిని కలిపి సౌర కుటుంబం (సోలార్ సిస్టం)గా వ్యవహరిస్తారని, తదితర అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి. ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### స్నేహితుడి కుటుంబానికి ఆపన్న హస్తం

చొప్పదండి, మార్చి 1: మండల పరిధిలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన గుర్రం దేవేందర్ రెడ్డి కొద్ది రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందగా, ఆయన స్నేహితులు (పట్టణంలోని విద్యా భారతి ఉన్నత పాఠశాల 1994-95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు) ఆ కుటుంబానికి ఆపన్నహస్తం అందజేశారు. దేవేందర్ రెడ్డికి ఇద్దరు కూతుర్లు ఉండడంతో ఆ కుటుంబానికి రూ. 41 వేల నగదు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పట్టణ మాజీ కౌన్సిలర్ కొట్టె అశోక్, ఆర్నకొండ రెడ్డి సంఘం అధ్యక్షుడు కేతిరెడ్డి మణిశంకర్ రెడ్డి, దేశాయిపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి మునిగాల సాయి కృష్ణ, న్యాయవాది మునిగాల శంకరయ్య, ఎల్లాల శ్రీనివాస్ రెడ్డి, పంతంగి పర్షయ్య, గుర్రం పద్మారెడ్డి, తెలుగు భాషా పండిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంబోజి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



భూపాలపట్నం గ్రామంలో గుర్రం దేవేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న బాల్య స్నేహితులు

### ఉత్తమ సేవలతోనే గుర్తింపు

గంగాధర, మార్చి 1: విద్యార్థులకు ఉత్తమ విద్య అందించడం ద్వారానే ఉపాధ్యాయుడికి గుర్తింపు వస్తుందని జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు అన్నారు. శనివారం ఒద్యారం ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్‌గా పని చేసిన పాలోజు రవీందర్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి అనేది ఒక వరమని, విద్యార్థులను భావి భారత పౌరులుగా తయారు చేసే అవకాశం ఒక్క ఉపాధ్యాయుడికే ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం రవీందర్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగ విరమణ సన్మానం

సైదాపూర్, మార్చి1: ఆకునూర్ జడ్పీహెచ్ఎస్ హిందీ ఉపాధ్యాయుడు ఠాకూర్ శాంతకుమార్ సింగ్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, మండల నోడల్ అధికారి రవీంద్రాచారి, మాజీ సర్పంచ్ రాయిశెట్టి చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ కిష్టయ్య, కాంప్లెక్స్ హెచ్ఎం దేవేందర్ రెడ్డి, హెచ్ఎంలు రామస్వామి, అనిత, అనురాధ, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

### కేక్ కోసి.. స్వీట్లు పంచి

తిమ్మాపూర్ రూరల్, మార్చి 1: బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మన్నెంపల్లి మాజీ ఉపసర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్ పుట్టిన రోజు వేడుకలను మండల వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. పొన్నం అభిమానులు, మిత్రులు, అనుచరులు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న 100 మందికి ఉచితంగా అల్పాహారం పంపిణీ చేశారు. మన్నెంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

### మోడల్ స్కూల్ సందర్శన

గన్నేరువరం, మార్చి 1: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కొత్తపల్లి మండలం ఎలగందులలోని మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలను శనివారం సందర్శించారు. ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియాలో భాగంగా ఈ సందర్శన చేపట్టినట్లు ఎంఈవో రామయ్య తెలిపారు. ఈ పథకంలో ఎంపికైన స్కూల్ విద్యార్థులు మరో స్కూల్ సందర్శించి, అక్కడ విద్యాబోధన, సైన్స్ ల్యాబ్, భోజనం అమలు తీరును, అలాగే వంట, తరగతి గదులను కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ట్రాక్టర్ బోల్తా: యువకుడి మృతి

జమ్మికుంట టౌన్(హుజూరాబాద్ టౌన్), మార్చి 1: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామ శివారులో ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో ఐలవేని ప్రశాంత్ (32) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన ప్రశాంత్, శనివారం ఉదయం సొంత పనులపై ట్రాక్టర్‌తో స్వగ్రామం నుంచి జమ్మికుంటకు బయలుదేరాడు. మార్గమధ్యంలో ధర్మారం గ్రామ శివారులో గల కెనాల్ వద్దకు రాగానే ట్రాక్టర్ టైరు పేలిపోవడంతో, వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న కెనాల్‌లోకి దూసుకువెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ప్రశాంత్ తలకు, చాతీకి తీవ్రగాయాలయ్యాయి. జమ్మికుంట ప్రభుత్వ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రశాంత్‌కు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. భార్య రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవి తెలిపారు.

**చెరువులో పడి వృద్ధుడు..**

కొత్తపల్లి, మార్చి 1: ప్రమాదవశాత్తు కొత్తపల్లి చెరువులో పడి పట్టణానికి చెందిన రాపెల్లి రాజయ్య (88) మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. శుక్రవారం ఇంటినుంచి బయటకు వెళ్లిన రాజయ్య తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెదికారు. శనివారం రాజయ్యకు సంబంధించిన దుస్తులు, చెప్పులు చెరువు వద్ద కనిపించడంతో గజ ఈతగాళ్లతో వెతికించగా మృతదేహం దొరికింది. బట్టలు ఉతుక్కునేందుకు చెరువులోకి దిగిన రాజయ్య, ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందినట్లు బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**కుక్కలు అడ్డు రావడంతో అదుపు తప్పిన మోపెడ్: వృద్ధుడికి గాయాలు**

శంకరపట్నం, మార్చి 1: మండలంలోని మొలంగూర్ క్రాస్ రోడ్డు వద్ద కుక్కలు ఒకదానితో ఒకటి పోట్లాడుకుని మోపెడ్‌కు అడ్డు రావడంతో వాహనం నడుపుతున్న వృద్ధుడు అదుపు తప్పి కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. సైదాపూర్ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన గుంటి ఐలయ్య అనే వృద్ధుడు టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్‌పై వ్యక్తిగత పనిపై కొత్తగట్టు గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా, మొలంగూర్ శివారులోని వీఎస్ఆర్ గార్డెన్ వద్ద రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. ఐలయ్య చేయి విరిగి, తీవ్ర గాయాలుకావడంతో 108 ఈఎంటీ సతీశ్‌రెడ్డి, పైలట్ సదన్ ప్రథమ చికిత్స అందిస్తూ అంబులెన్స్‌లో కరీంనగర్ దవాఖానకు తరలించారు.

### విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

వీణవంక, మార్చి 1: మండల కేంద్రంలోని కేజీబీవీతో పాటు జమ్మికుంట, ఇల్లందకుంటలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పదో తరగతి విద్యార్థినులకు యప్‌టీవీ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. యప్‌టీవీ సీఈవో పాడి ఉదయ్‌నందన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని 150 మంది విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లు వితరణ చేసినట్లు యప్‌టీవీ సిబ్బంది పేర్కొన్నారు. కార్యక్రమంలో తాళ్లపెల్లి కుమారస్వామి, దాసారపు లోకేశ్, వంశీకృష్ణ, మంతెన శ్రీధర్, తొట్ల రాకేశ్, మహంకాళి రాజు, తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మార్చి 1: నగరంలో ఇంటర్ లింక్ లైన్లు, ఏబీ స్విచ్, విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున ఆదివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-1 ఏడీఈ పంజాల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు కోర్టు కాంప్లెక్స్, కోర్టు వెనుక ప్రాంతం, కెమిస్ట్ భవన్, థియేటర్ ఏరియా, వేంకటేశ్వర టెంపుల్ ప్రాంతం, వావిలాలపల్లె, జెండా గద్దె, హోండా షోరూం, ఎస్ఈ ఆఫీస్ కాంపౌండ్ ఏరియా, బోయవాడ, లక్ష్మీనగర్, రాఘవేంద్ర నగర్.

ఉదయం 9 నుంచి 11గంటల వరకు మారుతీ నగర్, పాత బజార్, వెంకటసాయి రోడ్డు, అశోక్ నగర్, గౌరీ శంకర్ కాంప్లెక్స్, ఎస్ఎస్ గార్డెన్ రోడ్డు వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

### పేద ముస్లింలకు నిత్యావసర సరుకుల వితరణ

కలెక్టరేట్, మార్చి 1: రంజాన్ మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని, నగరంలోని 14వ డివిజన్ పరిధిలో గల పేద ముస్లింలకు శనివారం నిత్యావసర వస్తువులు ఉచితంగా పంపిణీ చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ అజీం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో వందమందికి పైగా నిరుపేదలకు 25 కిలోల బియ్యం, చక్కెర, నూనె, మిర్చి, టీ పౌడర్‌తో పాటు పప్పు దినుసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రంజాన్ పండుగను పేద ముస్లింలు కూడా ఆనందోత్సాహాల మధ్య జరుపుకొనేందుకు వీలుగా ఏటా ఉచితంగా నిత్యావసర వస్తువులు అందజేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పాల్గొన్న మౌలానా అమ్జద్ మాట్లాడుతూ, రంజాన్ మాసంలో దానధర్మాలు చేసిన వారు అల్లా కృపను పొందుతారన్నారు. మైనార్టీ నాయకులు అబ్దుల్ ఖదీర్, అజీజ్, అబ్దుల్ బారి, జాకీర్, మతిన్, అఫ్రోజ్, పూర్ణచందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### ఘనంగా సైన్స్ డే వేడుకలు

కమాన్‌చౌరస్తా, మార్చి 1 : జిల్లా కేంద్రంలోని హనుమాన్ నగర్ బ్లూ బెల్స్ పాఠశాలలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు వివిధ రకాల ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. వీటిలో ఇరిగేషన్, శరీర వ్యవస్థ పనితీరు, వాటర్ ప్యూరిఫయర్, ఆరోగ్యకరమైన ఆహారం వంటి ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జంగ సునీతా మనోహర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రాజెక్ట్‌లను తిలకిస్తున్న ప్రిన్సిపాల్ సునీతా మనోహర్ రెడ్డి

### అట్టహాసంగా కాకతీయ ఒలింపియాడ్ వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కమాన్‌చౌరస్తా, మార్చి 1 : జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ కాకతీయ ఒలింపియాడ్ పాఠశాల వార్షికోత్సవాలు అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విద్యాసంస్థల చైర్మన్ సీతారాం రెడ్డి, వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు రాజేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ శర్మ హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలు పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అతిథులు సత్కరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఒంటెల కామేశ్వర్ రెడ్డి, డైరెక్టర్ అజయ్ రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి

చొప్పదండి, మార్చి 1: పట్టణంలోని నివాస, గృహ, వాణిజ్య సముదాయాల యజమానులు 2024-25 ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను, నీటిపన్ను, లైసెన్స్ ఫీజు, అడ్వర్టైజ్మెంట్ ఫీజు బకాయిలు ఈ నెల 31లోగా చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు కోరారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, బకాయిలు చెల్లించని వారిపై మున్సిపల్ చట్టం, 2019 తెలంగాణ రెవెన్యూ రికవరీ చట్టం 1864 నిబంధనలు అనుసరించి చట్టప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

### ఎస్సీ వర్గీకరణ లోపాలు సవరించాలి

తెలంగాణచౌక్, మార్చి 1: ఎస్సీ వర్గీకరణపై ఎస్సీ కమిషన్ షమీమ్ అక్తర్ ఇచ్చిన నివేదికలోని లోపాలు సవరించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ డిమాండ్ చేశారు. నగరంలోని కోర్టు చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం నిర్వహించిన మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ముందుగా అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ అమలుచేసి మాదిగలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొమురన్న, ప్రభాకర్, అంజయ్య, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్, సంపత్, కొమురక్క, అశోక్ పాల్గొన్నారు.

### 'బలహీన వర్గాల పార్టీ ఎంఐఎం'

కలెక్టరేట్, మార్చి 1: కార్పొరేట్ వ్యవస్థ నిర్మాణమే లక్ష్యంగా కొనసాగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని కాంక్షించే ఏకైక పార్టీ ఎంఐఎం మాత్రమేనని, ఆపార్టీ నగర ధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. ఆపార్టీ 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని, నగరంలోని దారుసలాంలో శనివారం ఎంఐఎం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాబోయే నగర పాలక సంస్థ ఎన్నికల్లో నగరంలో 36 డివిజన్లతో పాటు రూరల్ మండలంలో కూడా ఎంఐఎం పార్టీ జెండా ఎగురేయబోతున్నదని పేర్కొన్నారు. అనంతరం ఆపార్టీ నాయకులు అబ్బాస్‌షమీ, బర్కత్ అలీ, ఖమ్రుద్దీన్, అతిన, అలీబాబా, అజర్, మాజిద హుస్సేన్, షకీలుద్దీన్, షాకీర్‌నహీ, అబ్దుల్లాఖాన్‌తో పాటు పలువురు నాయకులు, ముఖ్యకార్యకర్తలు హైదరాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభకు హాజరయ్యేందుకు తరలివెళ్లారు.

### పేదింటి ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక సాయం

తిమ్మాపూర్ రూరల్, మార్చి 1: మల్లాపూర్ గ్రామానికి చెందిన మడ్డి ఉమా-సంపత్ గౌడ్‌ది పేద కుటుంబం కాగా, వారికి ఇద్దరు అమ్మాయిలు. దంపతులిద్దరూ కూలి పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. మొదటి కూతురుకు వివాహం నిశ్చయం కాగా, పెళ్లికి ఆర్థిక ఇబ్బందులు ఉన్న విషయాన్ని తెలుసుకున్న నాయకులు ఆర్థిక సాయం అందించారు. పొల్లంపల్లి సొసైటీ మాజీ చైర్మన్ బుడిగే కొండయ్య గౌడ్, పరశురాములు గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు బత్తిని కీర్తిలత గౌడ్ రూ.10 వేల చొప్పున, నుస్తులాపూర్ మాజీ సర్పంచ్ రావుల రమేశ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, మన్నెంపల్లి మాజీ ఉపసర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్ రూ. 5 వేల చొప్పున మొత్తం రూ. 45 వేల నగదును కుటుంబానికి శనివారం అందజేశారు.

### ఘనంగా సీవీ రామన్ జయంతి వేడుకలు

రామడుగు, మార్చి 1: వెలిచాల శ్రీ సరస్వతీ హైస్కూల్లో శనివారం ప్రఖ్యాత భౌతికశాస్త్రజ్ఞుడు సర్ సీవీ రామన్ జయంతి సందర్భంగా జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకొన్నారు. ఇందులో భాగంగా ఆయా తరగతులకు చెందిన విద్యార్థులు వారి మెదడుకు పదునుపెట్టి తయారు చేసిన పరికరాలతో వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ మాట్లాడుతూ, సృష్టిలో ప్రతీది సైన్స్‌తోనే ముడిపడి ఉందనే వాస్తవాన్ని విద్యార్థులు గుర్తించాలన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కో కరస్పాండెంట్ ఉప్పుల సత్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వెలిచాల శ్రీ సరస్వతీ హైస్కూల్లో సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కో కరస్పాండెంట్ ఉప్పుల సత్యం